
జగిత్యాల కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా


సిరిసిల్ల కౌంటింగ్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి


జగిత్యాల: ఓట్ల లెక్కింపు కేంద్రం లో ఏర్పాటు చేసిన టేబుళ్లు


హుస్నాబాద్: కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

# నేడే కౌంటింగ్

## మరి కొద్ది గంటల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

- 13 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 24.56 లక్షల ఓట్లు పోల్ • నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు
- ఒక్కో చోట 14 టేబుళ్లు.. పోలింగ్ కేంద్రాలను బట్టి రౌండ్ల సంఖ్య • ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ మొదలు
- ముందుగా పోస్టల్ బ్యాలెట్.. 8.30 గంటల నుంచి ఈవీఎంలు • మధ్యాహ్నం కల్లా తేలనున్న భవితవ్యం
- కేంద్రాల వద్ద భారీ బందోబస్తు • ఉదయం 6 నుంచి రేపటి ఉదయం 6 గంటల దాకా 144 సెక్షన్
- ఓటరు తీర్పుపై ఎడతెగని ఉత్కంఠ • నేటితో అన్ని అంచనాలకూ తెర

కరీంనగర్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పూర్వ కరీంనగర్ జిల్లాలో హుస్నాబాద్‌ను కలుపుకొని 13 అంసెబ్లీ నియోజకవర్గాలున్నాయి. వీటి పరిధిలో 31,78, 980 మంది ఓటర్లు ఉండగా, అందులో 24,56,146 మంది ఓటు (77.26 శాతం) హక్కును వినియోగించుకున్నారు. అందుకు సంబంధించి హుస్నాబాద్ మినహాయిస్తే.. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నాలుగు జిల్లాల్లో ఏ జిల్లాకు ఆ జిల్లా పరిధిలోనే ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత నెల 30న ఎన్నికలు పూర్తి కాగానే.. ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలోకి తరలించారు. సదరు స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. నేటి కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లూ చేశారు.

### ఎక్కడెక్కడ కౌంటింగ్

నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లూ చేశారు. కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపును ఎస్సారార్ కాలేజీలో నిర్వహించనున్నారు. అలాగే జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాలకు సంబంధించి మల్యాల మండలం పోతారం సమీపంలోని వీఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో.. పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాలకు సంబంధించి రామగిరి జేఎన్‌టీయూ కళాశాలలోని అకాడమిక్ బ్లాక్– 2లో.. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించి తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి బాలికల సాంఘిక సంక్షేమ వసతి గృహంలో కౌంటింగ్ చేయనున్నారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గానికి సంబంధించి సిద్దిపేటలోని ఇందూరు కళాశాలలో లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

### ఓట్ల లెక్కింపు ఇలా

ఉదయం 8 గంటల నుంచే నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటు చేశారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్స్‌ను లెక్కిస్తారు. అర గంట వరకు ఈ లెక్కింపును పూర్తి చేసి, 8.30 గంటల నుంచి ఈవీఎంలో ఉన్న ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. ప్రతి నియోజకవర్గంలోని ఓట్లను రౌండ్ల వారీగా లెక్కించేందుకు 14 టేబుళ్లు వేశారు. ఒక్కో రౌండ్‌లో ఒక్కో పోలింగ్ కేంద్రం ఈవీఎంను ఒక టేబుల్‌కు ఇస్తారు. అలా ఒక రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాల ఈవీఎంలలో ఉన్న ఓట్లను కౌంట్ చేస్తారు. ఒక రౌండ్ పూర్తయిన తర్వాత మరో రౌండ్ కౌంటింగ్ ప్రారంభిస్తారు. ప్రతి రౌండ్‌లోనూ టేబుల్ వారీగా ఆయా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను క్రోడీకరించి.. వాటిని ఒకటికి రెండు సార్లు సరిచూసుకొని, అన్ని కరెక్టుగానే ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే జిల్లా రిటర్నింగ్ అధికారి సంతకంతో ఆ రౌండ్ ఫలితాలను బయకు విడుదల చేస్తారు. ఒక్కో టేబుల్‌కు నలుగురు సిబ్బందిని నియమించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి ఆయా పార్టీల నుంచి అధికారికంగా గుర్తించి అధికారులు ధ్రువీకరించిన ఏజెంట్లు మాత్రమే హాజరవుతారు.

### మూడంచెల భద్రత

ఓట్లు ముగిసిన తర్వాత స్ట్రాంగ్ రూంలకు చేపట్టిన భద్రతా చర్యలను కౌంటింగ్ ముగిసే వరకు కొనసాగిస్తున్నారు. అన్ని జిల్లాల్లో ఉదయం 6గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు 144 సెక్షన్ విధించడంతోపాటు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. అడుగడుగునా సీసీ కెమెరాలు అమర్చారు. లెక్కింపు కేంద్రాల్లో బారికేడ్లు అమర్చారు. విధులు నిర్వహించే సిబ్బందికి, అభ్యర్థుల తరపున వచ్చే ఏజెంట్లకు ప్రత్యేక పాసులు జారీ చేశారు. వీరిని మాత్రమే కౌంటింగ్ హాళ్లకు అనుమతించనున్నారు. మొబైల్ ఫోన్లు, పేపర్లు కౌంటింగ్ హాలులోకి అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే, మద్యం అమ్మకాలపై నిషేధం ఉందని, రోడ్లపై ర్యాలీలు, పటాకలు కాల్చడం, ఊరేగింపులు చేయరాదని, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడవద్దని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలుంటాయని హెచ్చరిస్తున్నారు.

### మరికొద్ది గంటల్లో తేలనున్న భవితవ్యం

విజయం కోసం ఎన్నడూ లేనంతగా ఈసారి అభ్యర్థులు హోరాహోరీగా తలపడ్డారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఈ నెల 28వ తేదీ చివరి వరకూ విశ్వప్రయత్నాలు చేశారు. ఈ దశలో ఎవరికి వారే గెలుపు తమదేనని చెబుతున్నారు. నేటి మధ్యాహ్నం వరకు ఫలితాలు వెలువడనుండగా, విజయం ఎవరిని వరిస్తుందో తెలిసిపోనున్నది. అయితే, ఎవరికి వారే ధీమాను వ్యక్తం చేస్తున్నా, లోలోపల మాత్రం టెన్షన్ కొనసాగుతున్నది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 24.56 లక్షల మంది ఓటర్లు అభ్యర్థుల భవిష్యత్‌ను తేల్చనుండగా, ఈసారి ప్రతి నియోజకర్గంలోనూ ఒక కన్ఫ్యూజన్ కనిపిస్తున్నది. పోలింగ్ నిశబ్దంగా సాగిన నేపథ్యంలో ఓటరు నాడి ఎవరికీ అంతు చిక్కకుండా ఉన్నది. మెజార్టీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. రెండు రోజులుగా వస్తున్న ఎగ్జిట్ పోల్స్‌పైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఈరోజు వెల్లడయ్యే ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు అనుగుణంగా ఉంటాయా..? లేక తారుమారు అవుతాయా..? గుమ్మనంగా సాగిన ఓటింగ్ ఎవరి విజయానికి అనుకూలంగా మారుతుందో.. విషయం తేటతెల్లం కానుండగా, అన్నీ పార్టీల అభ్యర్థుల్లోనూ ఉత్కంఠ నెలకొన్నది.

**నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ జరిగే రౌండ్ల వివరాలు**

| నియోజవర్గం | పోలింగ్ కేంద్రాలు | కౌంటింగ్ రౌండ్లు |
|---|---|---|
| కరీంనగర్ | 390 | 28 |
| చొప్పదండి | 327 | 24 |
| మానకొండూరు | 316 | 23 |
| హుజూరాబాద్ | 305 | 22 |
| హుస్నాబాద్ | 304 | 22 |
| జగిత్యాల | 254 | 19 |
| ధర్మపురి | 269 | 20 |
| కోరుట్ల | 262 | 19 |
| వేములవాడ | 260 | 19 |
| సిరిసిల్ల | 287 | 21 |
| మంథని | 288 | 21 |
| రామగుండం | 259 | 19 |
| పెద్దపల్లి | 290 | 21 |


కరీంనగర్: ఎస్సారార్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రంలో సిబ్బంది


సిరిసిల్ల స్ట్రాంగ్‌రూం వద్ద పోలీసుల పహారా


సిరిసిల్లలో సిద్ధమైన కౌంటింగ్ కేంద్రం


హుస్నాబాద్ కౌంటింగ్‌లో అధికారులు


రామగిరి: మంథని జేఎన్‌టీయూలో చేసిన ఏర్పాట్లు

# రాజన్న ఆలయంలో కార్తీక సందడి

వేములవాడ టౌన్, డిసెంబర్ 2 : కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. శనివారం 10వేలకుపైగా తరలివచ్చారు. వేకువజాము నుంచే ధర్మగుండంలో పవిత్ర స్నానాలు చేసి, కల్యాణకట్టలో తమ పిల్లలకు తలనీలాలను సమర్పించుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. గంటలపాటు క్యూలైన్ల నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. గర్భగుడిలో అభిషేకపూజలు, అన్నపూజలు, ఆకులపూజలు నిర్వహించుకున్నారు. ఆలయంలో గండాదీపం, పల్లకీ సేవలు, కల్యాణాల మొక్కులు, సత్యనారాయణవ్రతాల మొక్కులు తీర్చుకున్నారు.


ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించుకుంటున్న భక్తులు


క్యూలైన్లలో భక్తులు


ఆలయ ఆవరణలో భక్తుల రద్దీ


సిరిసిల్ల పోలింగ్ కేంద్రం వద్ద గుర్తింపు కార్డులను చూపుతున్న మహిళలు

# అతివలే అంతిమ నిర్ణేతలు

- అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా చైతన్యం
- పురుషులకు మించి ఓటు హక్కు వినియోగం
- రామగుండం మినహా 12 నియోజకవర్గాలో 93,874 ఓట్లు అధికం • కోరుట్లలో అత్యధికం



కరీంనగర్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు చైతన్యం చూపారు. ఈ నెల 30న జరిగిన పోలింగ్‌లో తమ సత్తా చాటారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం మినహా మిగిలిన పన్నెండు నియోజకవర్గాల్లో మహిళలే అత్యధికంగా ఓటు వేశారు. 13 నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్లు 31,78,980 మంది ఉండగా, అందులో 15,59,780 మంది పురుషులు, 16.19,038 మంది మహిళలు ఉన్నారు. అంటే పురుషుల కన్నా 59,258 మంది ఎక్కువగా ఉన్నారు. మొత్తంగా 24,56,146 మంది ఓటు (77.26 శాతం) హక్కును వినియోగించుకోగా, అందులో పురుషులు 11,81,999 మంది, మహిళలు 12,74,065ఓటు వేశారు. ఈ లెక్కన 93,874 మంది మహిళలే ఎక్కువగా ఓటు వేసి తమ చైతన్యాన్ని చాటుకున్నారు. అయితే అభ్యర్థుల మధ్య పోటాపోటీ ఉన్న నేపథ్యంలో మహిళా ఓట్లే కీలకంగా మారే అవకాశం ఉన్నది. వీళ్లే అంతిమ నిర్ణేతలు అవుతారన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**నియోజకవర్గాల వారీగా మహిళ ల వివరాలు**

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | పోలైన ఓట్లు | మొత్తం పురుషులు | పోలైన ఓట్లు | మొత్తం మహిళలు | పోలైన ఓట్లు | మహిళా ఓట్లు అధికం |
|---|---|---|---|---|---|---|---|
| కరీంనగర్ | 3,55,054 | 2,24,504 | 1,77,893 | 1,12,025 | 1,77,117 | 1,12,458 | 433 |
| చొప్పదండి | 2,32,990 | 1,81,194 | 1,13,050 | 85,538 | 1,19,933 | 95,655 | 10,117 |
| మానకొండూర్ | 2,21,613 | 1,84,413 | 1,08,846 | 91,497 | 1,12,766 | 92,915 | 1,418 |
| హుజూరాబాద్ | 2,49,558 | 2,07,609 | 1,21,809 | 1,02,194 | 1,27,743 | 1,05,410 | 3,216 |
| మొత్తం | 10,59,215 | 7,97,720 | 5,21,598 | 3,91,254 | 5,37,559 | 4,06,438 | 15,184 |
| జగిత్యాల | 2,31,468 | 1,74,584 | 1,11,720 | 78,920 | 1,19,728 | 95,651 | 16,731 |
| ధర్మపురి | 2,26,880 | 1,79, 271 | 1,11,172 | 83,567 | 1,15,702 | 95,704 | 12,137 |
| కోరుట్ల | 2,40,855 | 1,82,140 | 1,15,027 | 80,353 | 1,25,824 | 1,01,785 | 21,432 |
| మొత్తం | 6,99,203 | 5,35, 997 | 3,37,919 | 2,42,840 | 3,61,254 | 2,93,140 | 50,300 |
| పెద్దపల్లి | 2,54,266 | 2,07,397 | 1,26,046 | 1,03,686 | 1,28,212 | 1,03,709 | 23 |
| రామగుండం | 2,21,019 | 1,51,865 | 1,11,200 | 76,830 | 1,09,794 | 75,022 | – |
| మంథని | 2,36,442 | 1,95,635 | 1,16,707 | 97,062 | 1,19,716 | 98,565 | 1,503 |
| మొత్తం | 7,11,727 | 5,54,897 | 3,53,953 | 2,77,578 | 3,57,722 | 2,77,296 | 1,526 |
| సిరిసిల్ల | 2,44,426 | 1,88,202 | 1,19,663 | 90,110 | 1,24,756 | 98,088 | 7,978 |
| వేములవాడ | 2,22,232 | 1,74,315 | 1,06,890 | 78,280 | 1,15,331 | 96,024 | 17,744 |
| మొత్తం | 4,66,658 | 3,62,517 | 2,26,553 | 1,68,390 | 2,40,087 | 1,94,112 | 25,722 |
| హుస్నాబాద్ | 2,42,177 | 2,05,017 | 1,19,757 | 1,01,937 | 1,22,416 | 1,03,079 | 1,142 |
| ఉమ్మడి జిల్లా | 31,78,980 | 24,56,146 | 15,59,780 | 11,81,999 | 16,19,038 | 12,74,065 | 93,874 |